
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500,పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు.



పోలీసు వలయంలో అమలాపురం

అమలాపురంలో రౌడీషీటర్ హత్య, అతడి స్నేహితుడిపై హత్యాయత్నం, తదనంతరం జరిగిన ఆస్తుల ధ్వంసం పరిణామాలపై పోలీసులు అప్రమత్తమయ్యారు. - 8లో▸

శనైశ్చరునికి పూజలు, తైలాభిషేకాలు

కొత్తపేట: శని దోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి క్షేత్రంలో శ్రీ ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామికి శనివారం ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ రూపాల్లో టిక్కెట్ల ద్వారా రూ.81,817, అన్నప్రసాదం విరాళాలుగా రూ.10,991 చొప్పున ఆదాయం సమకూరిందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ తెలిపారు.

న్యూస్‌రీల్

ద్రాక్షారామకు రాములోరి పాదుకలు



అయోధ్య రాముడికి సమర్పించనున్న రజత పాదుకలు

రామచంద్రపురం రూరల్: అయోధ్య రామాలయంలో రాముల వారికి సమర్పించనున్న రజత పాదుకలు ద్రాక్షారామ చేరుకుంటున్నాయి. వీటిని ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ భక్తుల సందర్శనార్థం ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఉంచుతున్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు శనివారం విలేకరులకు ఈ విషయం తెలిపారు. పాదుకలను తయారు చేయించిన దాత చల్లా శ్రీను శాస్త్రి.. భక్తుల కోరిక మేరకు 'శ్రీరామ పాదుకలు – భారతదేశ దర్శన యాత్ర' పేరిట శ్రీ సీతారామ ఫౌండేషన్ ఆధ్వర్యాన పల్లెలు, పట్టణాల్లో భక్తుల ఇళ్లు, దేవాలయాల్లో ఈ పాదుకలు ఉంచి, పూజలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తున్నారని వివరించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కోరారు.

బాలబాలాజీ సన్నిధిలో భక్తుల సందడి



బాలబాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: కోనసీమ ఇలవేల్పుగా పూజలందుకుంటున్న అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. శ్రావణ మాసం కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారికి తలనీలాలు, ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి, తమ కోర్కెలు నెరవేర్చాలని వేడుకున్నారు. ఉభయ దేవేరులతో కొలువు తీరిన స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.2.46 లక్షల ఆదాయం సమకూరిందని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.92 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.54,774 వచ్చాయని వివరించారు. మొత్తం 3,582 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి అన్న ప్రసాదం 2,861 మంది స్వీకరించారు.

రత్నగిరిపై మోగిన పెళ్లి బాజా

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన పెళ్లిబృందాలు, భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున సత్యదేవుని సన్నిధిలో సుమారు వంద వివాహాలు జరిగాయి. ఈ వివాహాలు చేసుకున్న దంపతులు, బంధుమిత్రులతో పాటు ఇతర ప్రాంతాల్లో పెళ్లి చేసుకున్న జంటలు కూడా సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. సత్యదేవుని దర్శనానికి సాధరణ భక్తులు కూడా అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారిని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించారని అధికారులు తెలిపారు. వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు. ఆది, సోమవారాలలో కూడా రత్నగిరిపై వివాహాలు పెద్ద సంఖ్యలో జరిగే అవకాశం ఉంది. దీంతో దేవస్థానంలో రద్దీ నెలకొనే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మహానేతా.. మనసా స్మరామి



- దివంగత సీఎం వైఎస్సార్‌కు ఘన నివాళి
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, అమలాపురం: బడుగుల బతుకులపై సంక్షేమ సంతకం చేసి.. వారి అభివృద్ధినే అహరహం శ్వాసించి.. అన్నదాతల అభ్యున్నతికి అనుక్షణం పరితపించి.. ప్రజా పాలనలో సరికొత్త ఒరవడిని సృష్టించిన దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను జిల్లా వాసులు నిండైన అభిమానంతో స్మరించుకున్నారు. తమ ప్రియతమ నేత వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి మనసారా నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో పరిధిలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీ, 22 మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

◆ జిల్లా కేంద్రమైన అమలాపురంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యాన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల సెంటర్‌లోని వైఎస్సార్ నిలువెత్తు కాంస్య విగ్రహానికి మంత్రితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్ (నాని) ఆధ్వర్యాన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో కలిసి వృద్ధులకు, పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

◆ రామచంద్రపురంలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మంత్రితో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ పరిధిలోని కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం రూరల్ మండలాల్లో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో కూడా మంత్రి పాల్గొన్నారు.

◆ అల్లవరం మండలం కోడూరుపాడు సెంటర్‌లో మహానేత విగ్రహానికి అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో కొలువై ఉన్నారని అన్నారు. రెండుసార్లు సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని పాలన సాగించారన్నారు. 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, రైతులకు ఉచిత వ్యవసాయ విద్యుత్ వంటి అనేక వినూత్న పథకాలతో ప్రజల మన్ననలు అందుకున్నారని కొనియాడారు.

◆ కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలో జరిగిన మహానేత వర్ధంతి కార్యక్రమాల్లో వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యాన రాజరత్న సెంటర్‌లోని వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు.



రామచంద్రపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి వేణు తదితరులు



అమలాపురంలో పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్



అల్లవరం మండలం కోడూరుపాడులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

ప్రజలకు చేరువగా న్యాయవ్యవస్థ



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జడ్జి నరేష్, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

ముమ్మిడివరం: బాధిత వర్గాలు సమాచారం ఇస్తే ఎటువంటి మారుమూల ప్రాంతానికైనా వెళ్లి న్యాయం చేసే విధంగా న్యాయ వ్యవస్థ పని చేస్తోందని అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ అన్నారు. స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) న్యూ మాడ్యూల్ మెగా లీగల్ సర్వీసెస్ క్యాంపు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ, జిల్లా పరిపాలనా యంత్రాంగం సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జడ్జి నరేష్ మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికుల హక్కులను కాపాడటం, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంతో పాటు ఆడపిల్లల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వార్డెన్లు అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక దృష్టి సారిస్తామని వివరించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, సమాజంలోని బాధిత వర్గాలను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై ప్రజలకు అవగాహన పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఇప్పటికే 50 క్యాంపులు నిర్వహించామని, 15 వేల మందికి అవగాహన కల్పించామని చెప్పారు. తొలుత కళాశాల ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, స్త్రీ, శిశు సంక్షేమ, కార్మిక, విభిన్న ప్రతిభావంతుల శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జడ్జి, కలెక్టర్ ప్రారంభించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. మహిళా గ్రూపులకు రూ.22.10 కోట్ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గౌరీశంకరరావు, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

చెప్పారంటే.. చేస్తారంతే..

- జూలై నెలాఖరులో గోదావరికి వరదలు
- కోనసీమలో ఆగస్టు 8న సీఎం జగన్ పర్యటన
- దెబ్బ తిన్న పంటలకు నెలలో పరిహారం ఇస్తామని నాడు హామీ
- అంతకంటే ముందే పెట్టుబడి రాయితీ విడుదల
- రైతుల ఖాతాల్లో సుమారు రూ.3 కోట్ల జమ



గత నెల 8న కోనసీమలో రైతులను వరద నష్టాలు అడిగి తెలుసుకుంటున్న సీఎం జగన్

సాక్షి, అమలాపురం: చెప్పారంటే.. చేస్తారంతే.. అనే మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి చేతల్లో నిరూపించారు. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టపోయిన రైతులకు నెల రోజుల్లో పెట్టుబడి రాయితీ (పరిహారం) అందిస్తానంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. చెప్పిన గడువు కన్నా ముందే రైతుల ఖాతాల్లో పెట్టుబడి రాయితీ నిధులు జమ చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత జూలై నెలాఖరులో వచ్చిన వరదలకు జిల్లాలోని గోదావరి లంక గ్రామాల్లో ఉద్యాన, కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. అరటి, కూరగాయలు, బొప్పాయి, తమలపాకు పంటలకు అధికంగా నష్టం కలిగింది. జిల్లాలో పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం మండలాల్లో పంటలు ఎక్కువగా దెబ్బ తిన్నాయి. జిల్లా వ్యాప్తంగా 3,868 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. దీనిలో అత్యధికంగా కూరగాయ పంటలు 2,384, అరటి 1,294 ఎకరాల్లో దెబ్బ తిన్నాయి. బొప్పాయి, తమలపాకు, ఇతర పంటలకు 190 ఎకరాల్లో నష్టం జరిగింది

హామీ నెరవేర్చుకున్న సీఎం

గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు వచ్చిన సీఎం జగన్ గత నెల 8వ తేదీన ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. ముంపు బాధితులను పరామర్శించారు. వరదలకు దెబ్బ తిన్న కూరగాయ పంటలు, అరటి తోటలను క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వరదలతో సర్వం కోల్పోయామని, తమను ఆదుకోవాలని ఆ సందర్భంగా రైతులు సీఎం జగన్‌కు మొర పెట్టుకున్నారు. పంట నష్టాన్ని కళ్లారా చూసిన ఆయన.. నెల రోజుల్లో పెట్టుబడి రాయితీ అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. పది రోజుల్లో పంట నష్టం అంచనాలు రూపొందించాలని, జాబితాను రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) ఉంచాలని ఆదేశించారు. ఎవరైనా తమ పంట నష్టం నమోదు కాలేదని చెప్తే వారికి మరోసారి అవకాశం కల్పించాలని అక్కడే ఉన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉద్యాన అధికారులను ఆదేశించారు.

ఆగమేఘాలపై నివేదిక

సీఎం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఆగమేఘాలపై పంటనష్టం అంచనాలు రూపొందించింది. సామాజిక తనిఖీ నిమిత్తం ఆ జాబితాను ఆర్‌బీకేల్లో ప్రదర్శించింది. రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించింది. ఈ మొత్తం ప్రక్రియను కేవలం 20 రోజుల్లో పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీని ప్రకారం జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పెట్టుబడి రాయితీ నిధులు విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలోని 51 గ్రామాల్లో 3,910.64 ఎకరాల్లో దెబ్బ తిన్న పంటకు సంబంధించి, 5,123 మంది రైతుల ఖాతాల్లో రూ.3,00,44,095 పంట నష్ట పరిహారం నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం జమ చేశారు. దీనిలో జూలై వరద నష్టాలకు సంబంధించి 3,866.61 ఎకరాలకు గాను 5,077 మంది రైతులకు రూ.2,95,97,995, మే నెలలో కురిసిన భారీ వర్షాలతో జరిగిన నష్టానికి సంబంధించి 44 ఎకరాలకు గాను 46 మంది రైతులకు రూ.4,46,100 చొప్పున అందించారు. ఆయా రైతుల ఖాతాల్లో ఆ పరిహారం సొమ్ములు జమ అవుతున్నాయి. నెల రోజుల్లో పరిహారం ఇస్తానని చెప్పినా.. కేవలం 24 రోజుల్లోనే అందిస్తూ సీఎం జగన్ బటన్ నొక్కడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అరుదైన ఘనత

పంట నష్టపోయిన రైతులకు తరువాతి పంట కాలంలో పెట్టుబడి రాయితీ అందించడాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన గొప్ప మార్పుగా రైతులు చెబుతారు. గత టీడీపీ పాలనలో పంట నష్టపోయి నెలలు గడచినా పెట్టుబడి రాయితీ అందేది కాదు. కొన్ని సందర్భాల్లో ఏడాది కూడా పట్టేది. దీనికి భిన్నంగా ఒక సీజన్‌లో పంట నష్టం జరిగితే, తరువాతి పంట పెట్టుబడికి ఉపయోగపడేలా సీఎం జగన్ పెట్టుబడి రాయితీ ఇస్తున్నారు. ఈసారి ఒక అడుగు ముందుకేసి చెప్పిన గడువు కన్నా ముందే.. కేవలం నెల రోజుల్లోపే పెట్టుబడి రాయితీ విడుదల చేయడంపై రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అంటున్నారు.

నెల రోజుల్లోగా అందడం ఇదే తొలిసారి



ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ నెల రోజుల్లోగా అందించడం ఇదే తొలిసారి. నాకు కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో ఐదెకరాల అరటి తోట ఉంది. అది ఇటీవలి వరదలకు మునిగి, పంట దెబ్బ తింది. నాకు పెట్టుబడి రాయితీగా రూ.32 వేలు అందుతోంది.

– పెదపూడి బాపిరాజు, వాడపాలెం, కొత్తపేట మండలం

రూ.19 వేలు వచ్చింది



గోదావరి వరదల్లో 1.9 ఎకరాల్లో అరటి పంట దెబ్బ తింది. దీనికి పరిహారంగా ప్రభుత్వం నా బ్యాంకు ఖాతాల్లో రూ.19 వేలు జమ చేసింది. గతంలో వరదల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు ఆలస్యం చేసేవి. కానీ ఈ ప్రభుత్వం వెంటనే సాయం అందించింది.

– గండి కృష్ణ, అరటి రైతు, అయినవిల్లిలంక, అయినవిల్లి మండలం

జగనన్న ఆదుకున్నాడు



గతంలో ఏటా గోదావరికి వరదలు వచ్చినప్పుడు పంటలు నష్టపోయాం. అయితే మాకు ఏ నాయకుడూ వచ్చి పరిహారం ఇచ్చిన దాఖలాల్లేవు. గత నెలలో వచ్చిన వరదలకు నా రెండెకరాల పొలంలో సాగు చేసిన బెండ, మునగ పంటలు దెబ్బ తిన్నాయి. మా బాధలు చూసేందుకు సీఎం జగన్ నేరుగా మా గ్రామం వచ్చి నష్టపోయిన పంటలను పరిశీలించారు. మమ్మల్ని ఓదార్చడమే కాకుండా నెలాఖరులోగా పంట నష్టపరిహారం ఇస్తామని భరోసా ఇచ్చారు. నాకు రూ.12 వేల పరిహారం అందించారు. ఆయనకు నా కృతజ్ఞతలు.

– బొక్కా నాగేశ్వరరావు, రైతు, లంకాఫ్ ఠాణేలంక, ముమ్మిడివరం మండలం

ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సులు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సులు

కొవ్వూరు: దొమ్మేరు గ్రామ శివారున రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో 26 మంది గాయపడ్డారు. వివరాలివీ.. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి రాజమహేంద్రవరం వస్తున్న పల్లె వెలుగు బస్సును.. కొవ్వూరు నుంచి ఏలూరు వెళ్తు మరో పల్లె వెలుగు బస్సు ఢీకొంది. లారీని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో రెండు బస్సుల ముందు భాగాలూ దెబ్బ తిన్నాయి. ప్రమాదానికి గురైన రెండు బస్సులూ కొవ్వూరు డిపోకు చెందినవే. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన 18 మందికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఇళ్లకు పంపించారు. మరో ముగ్గురికి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురిలో ఐదుగురిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో లారీ ముందు వెళ్తున్న మోటార్ సైక్లిస్టు బస్సు ముందు చక్రంలో పడిపోయారు. అయితే, అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆయన మోటార్ సైకిల్ నుజ్జునుజ్జయ్యింది. హైవే పెట్రోలింగ్ ఏఎస్సై జీఆర్‌కే గంగాధర్ ఆధ్వర్యాన క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తరలించారు.

మెరుగైన వైద్యం అందించాలి : మంత్రి వనిత

ఈ ప్రమాదంపై రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత స్పందించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ, పోలీసులు అధికారులను ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టమూ లేకపోయినప్పటికీ 26 మంది గాయపడటం దురదృష్టకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

'నన్నయ'కు 125 అధ్యాపక పోస్టుల మంజూరు



ఆచార్య పద్మరాజు

రాజానగరం: వివిధ బోధన విభాగాల్లో ఉన్న ఖాళీల భర్తీ ప్రక్రియలో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీకి 125 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయి. ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

తొలుత 128 పోస్టులకు అనుమతి ఇవ్వగా, వివిధ కారణాలతో మూడు పోస్టులు నిలుపు చేశారన్నారు. వర్సిటీలో ఇప్పటికే వివిధ కేటగిరీల్లో 26 పోస్టులుండగా, మరో 99 మందిని నియమించేందుకు అవకాశం లభించిందన్నారు. వీటిలో 77 అసిస్టెంట్ ప్రొఫెసర్, 33 అసోసియేట్ ప్రొఫెసర్, 18 ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయని వివరించారు. మంజూరైన పోస్టుల్లో నవంబరు 14లోగా నియామకాలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయితే బోధన, పరిశోధనల్లో నాణ్యత మరింత పెరుగుతుందని ఆచార్య పద్మరాజు ఆశాభావా వ్యక్తం చేశారు.



ఆలయంలో భక్తుల కోలాహలం

కిటకిటలాడిన వాడపల్లి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు తరలివచ్చి, స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో గోవిందనామ స్మరణ ప్రతిధ్వనించింది. స్వామి వారిని వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, విరాళాల ద్వారా స్వామి వారికి రూ.30,52,534 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయం వద్ద ట్రాఫిక్ పెరగడంతో ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

పోలీసు వలయంలో అమలాపురం

- రౌడీషీటర్ హత్య, తదనంతర పరిణామాలతో అప్రమత్తం
- 15 చోట్ల పికెట్లు
- డీఐజీ, ఇద్దరు ఎస్పీలతో శాంతిభద్రతల పరిరక్షణ
- నిందితుల వేటలో పోలీసు ప్రత్యేక బృందాలు



అమలాపురం పట్టణంలో మోహరించిన పోలీసులు

అమలాపురం టౌన్: రౌడీషీటర్ పోలిశెట్టి కిషోర్ హత్య, అతడి స్నేహితుడు అడపా సాయి లక్ష్మణ్‌పై హత్యాయత్నం, తదనంతరం జరిగిన ఆస్తుల ధ్వంసం పరిణామాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా శుక్రవారం అర్ధరాత్రి నుంచే భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అమలాపురం పట్టణంతో పాటు ఈదరపల్లి ప్రాంతాలు శనివారం పూర్తిగా పోలీసు వలయంలోకి వెళ్లాయి. అడుగడుగునా పోలీసు పహరాలు, పికెట్లు ఏర్పాటు చేశారు. దాదాపు 400 మంది పోలీసులను మోహరించారు. అమలాపురంలోని టీడీపీ నాయకుడు, మాజీ రౌడీషీటర్ గంధం పల్లంరాజు ఇంటి వద్ద, అతడి షాపు ఉన్న సప్తగిరి అపార్ట్‌మెంట్, కొంకాపల్లిలోని రౌడీషీటర్ ఆనంద్ ఇంటి వద్ద, అల్లవరం మండలం గూడాలలోని సుధీర్ ఇంటి వద్ద, ఈదరపల్లిలోని ఇద్దరి రౌడీ గ్యాంగ్ ఇళ్ల వద్ద, అమలాపురంలోని ముఖ్య కూడళ్లు కలిపి మొత్తం 15 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. అమలాపురంలో అల్లర్లకు అర్ధరాత్రి నుంచే పోలీసులు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాష్, కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్ విజయారావు ఆధ్వర్యాన పోలీసు పహారా కొనసాగుతోంది. రౌడీషీటర్ల ఆగడాలు, శాంతిభద్రతల పరిస్థితిపై పోలీసు ఉన్నతాధికారులు ఎస్పీ కార్యాలయంలో శనివారం పలుమార్లు సమీక్షించారు. ఇక నుంచి రౌడీషీటర్లపై మరింతగా ఉక్కుపాదం మోపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీధర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పోలీసు బందోబస్తుకు పలు సూచనలు ఇచ్చారు. కిషోర్‌ను హత్య చేయడంతో పాటు సాయిలక్ష్మణ్‌పై హత్యాయత్నానికి పాల్పడి, పరారైన రౌడీ గ్యాంగ్ కోసం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆధ్వర్యాన రెండు ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఇప్పటికే కొంతమంది అనుమానితులను, రౌడీషీటర్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

రౌడీషీటర్లను ఉపేక్షించేది లేదు

జిల్లా ఎస్పీ శ్రీధర్



రౌడీషీటర్లను ఉపేక్షించేది లేదని, వారి కదలికలపై ఇక నుంచి నిరంతర నిఘా పెడతామని, మరింతగా ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ హెచ్చరించారు. తన కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఈదరపల్లిలో రౌడీషీటర్ హత్య, అతడి స్నేహితుడిపై హత్యాయత్నం కేసులను లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. రౌడీషీటర్ల మూలాల్లోకి వెళ్లి విచారిస్తున్నామని చెప్పారు. ఈ హత్య, తదితర పరిణామలపై సోషల్ మీడియా ద్వారా ఎవరైనా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిస్థితి ప్రశాంతంగా ఉందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రత పరిరక్షణకు అందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో నిందితులందరినీ త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ శ్రీధర్ చెప్పారు.

• హరిత సీమలో ఎడారి ఓడలు



కనుచూపు మేరంతా ఇసుక తిన్నెలు పరచుకుని ఉండే ఎడారిలో ప్రయాణాలకు ఒంటెలు ఉపయోగపడుతూంటాయి. అందుకే వీటిని ఎడారి ఓడలని అంటూంటారు. అయితే, వీటిని కొంత మంది బతుకుతెరువు కోసం ఉపయోగించుకుంటూ.. పొట్ట చేత పట్టుకుని వివిధ ప్రాంతాల్లో సంచార జీవనం గడుపుతున్నారు. ఇదే క్రమంలో ఈ ఎడారి ఓడలు.. కనుచూపు మేరంతా ఆకుపచ్చదనం పరచుకున్న మన కోనసీమలో దర్శనమిస్తున్నాయి. నెల్లూరుకు చెందిన కొందరు మహిళలు రెండు ఒంటెలతో శనివారం సఖినేటిపల్లి వద్ద గోదావరి నది దాటి ఈ హరిత సీమకు చేరుకున్నారు. ఆ ఒంటెలతో ఇంటింటికీ తిరిగి పొట్ట నింపుకొంటున్నారు. కొందరు చిన్నారులు ఆ ఒంటె పైకి ఎక్కి.. సరదాగా ఊరేగుతూ.. ఆ మహిళలకు డబ్బులు ఇస్తున్నారు.

– మలికిపురం